హైదరాబాద్
2-8-2023
సంపుటి:08
సంచిక: 332
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



## అంబులెన్స్..15 నిమిషాల్లోనే

- 466 అత్యవసర వాహనాలుప్రజాసేవలోకి
- ఆ సమయాన్ని మరింత తగ్గేలా చూస్తాం
- 50 వేల పడకలతో ప్రభుత్వ వైద్యం పటిష్ఠం
- కరోనా తాతొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధం
- 108 ఉద్యోగులకు 4 స్లాబుల్లో వేతనాలు
- ఆశ కార్యకర్తల ఫోన్ బిల్లులను చెల్లిస్తాం
- ఇక్కడ స్కీములు.. బీజేపీ రాష్ట్రాల్లో స్కాములు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- కొత్త వాహనాలను ప్రారంభించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, గతంలో అంబులెన్స్ నిర్దేశిత ప్రాంతానికి చేరేందుకు 30 నిమిషాలు పట్టేదని, ఇప్పుడు 15 నిమిషాల్లోనే అంబులెన్స్ సిద్ధంగా ఉంటున్నదని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. దీనిని మరింత తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నట్టు వెల్లడించారు. అంబులెన్స్‌లను 'డైనమిక్ పొజిషన్'లో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అంబులెన్స్‌ను రోజంతా ఒకేచోట ఉంచకుండా ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలకు సమీపంలో ఉంచేలా ఆలోచన చేస్తున్నామని చెప్పారు. అత్యవసర సమయాల్లో సేవలు అందించే 466 కొత్త వాహనాలను ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ప్రారంభించారు. హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో 204 అంబులెన్స్‌లు, 228 అమ్మ ఒడి, 34 పా ర్థివ (హర్సే) వాహనాలకు జెండా ఊపారు. అనంతరం సభను ఉద్దేశించి మంత్రి హరీశ్‌రావు ప్రసంగించారు. సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనంలో రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో పడకలు 50 వేలకు చేరుకొంటున్నాయని చెప్పారు. 'కరోనానే కాదు భవిష్యత్తులో

2లో

# రూపు మారుతున్న ఉత్తరాంధ్ర

## విశాఖపట్నంకు ఆణిముత్యంలా ఇనార్బిట్ మాల్

- దక్షిణాదిలోనే అతిపెద్ద మాల్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భూమి పూజ
- రెండో దశలో 2.5 లక్షల చదరపు అడుగుల్లో 'ఐటీ స్పేస్'.. మరో 3 వేల జాబ్స్
- హిందూపురంలో 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు సన్నద్ధం
- ఎలాంటి సహకారం కావాలన్నా ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు..
- జీవీఎంసీ పరిధిలో రూ.134.58 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- ఏయూలో రూ.130 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులను ప్రారంభించిన ముఖ్యమంత్రి




విశాఖపట్నం: విశాఖ అభివృద్ధికి మరింత దోహదపడేలా నగరానికి ఆణిముత్యంలా ఇనార్బిట్ మాల్ నిలిచిపోతుందని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. విశాఖలో మరో ప్రాజెక్టుకు శ్రీ కారం చుట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంగళవారం విశాఖ పర్యటన సందర్భంగా కైలా సపురం ప్రాంతంలో రూ.600 కోట్ల పెట్టుబడు లతో రహేజా గ్రూప్ చేపట్టిన ఇనార్బిట్ మాల్ ని ర్మాణ పనులకు సీఎం జగన్ భూమి పూజ చేశారు. రూ.134.58 కోట్లతో జీవీఎంసీ తలపెట్టిన అభివృద్ధి పనులకు సీఎం చేతుల

2లో

## అన్నాభావు సాఠేకు భారతరత్న ఇవ్వాలి

- కేంద్రానికి ముఖ్యమంత్రి కేసీఆర్ డిమాండ్..
- ఇండియన్ మాక్సింగోర్కీకి అదే సముచిత గౌరవం
- సాఠే సాహిత్యాన్ని అన్ని భాషల్లోకి అనువదించాలి..
- మహాకవిని రష్యా గుర్తించినా స్వదేశం పట్టించుకోలె
- మాతంగి సమాజానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది..
- వాటేగావ్ సభలో సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- కొల్హాపూర్‌లో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు..
- ఛత్రపతి సాహూమహరాజ్ సమాధి వద్ద నివాళులు



హైదరాబాద్: ప్రముఖ మరాఠా కవి అన్నాభావు సాఠే కు భారతరత్న పురస్కారం ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చే శారు. అన్నాభావ్‌సాఠే 103వ జయంతి సందర్భంగా మంగళవారం మహారాష్ట్రలోని వాటేగావ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగసభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. మాతంగి సామాజిక

2లో



## సహాయక చర్యలేం చేపట్టారు..?

- భవిష్యత్‌లో వరదలతో నష్టం వాటిల్లకుండా ఏం చేస్తున్నారు?
- ప్రభుత్వంపై హైకోర్టు ప్రశ్నల వర్షం
- రెండు వేర్వేరు అఫిడవిట్లు దాఖలు చేయాలన్న ధర్మాసనం
- టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచన

హైదరాబాద్: గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరద నివారణ, బాధితులకు సహాయం, పరిహారం అందజేత లాంటి వివరాలపై,

2లో

## గురుగ్రామ్‌లో ఇమామ్ హత్య

- ఢిల్లీ శివారుకు పాకిన హరియాణా మత ఘర్షణలు
- సోమవారం అర్ధరాత్రి ప్రార్థనా మందిరానికి నిప్పు
- రెండు చోట్ల అల్లర్లలో ఐదుకు పెరిగిన మరణాలు
- గో రక్షక్ మోనూ మనేసర్ వీడియోతోనే హింస!!
- అతను పాల్గొంటున్నాడనే యాత్రపై దాడికి ప్లాన్
- సమీప కొండలపై దాక్కుని రాళ్లు విసిరి, కాల్పులు
- నూహ్ ఆలయంలో గంటల పాటు 2,500 మంది
- వారు బయటకు రాకుండా వాహనాల దహనం



గురుగ్రామ్: ఓవైపు మణిపూర్‌లో జరిగిన దారుణాలపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తం అవుతుండగా.. మరోవైపు హరియాణాలో మత ఘర్షణలు చెలరేగాయి. మణిపూర్‌పై పార్లమెంటులో చర్చ,

2లో

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం 20 మంది మృతి

ముంబై, ఆగస్టు 1: మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ పనుల్లో పిల్లర్ల పైకి బీమ్‌లను తీసుకెళ్లే యంత్రం(క్రేన్) కూలి 20 మంది దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన ?థానే జిల్లాలోని షాహాపూర్‌లోని సర్లంబే గ్రామంలో మంగళవారం



2లో

## ఓబీసీ ఉప వర్గీకరణపై నివేదిక

- దాదాపు ఆరేళ్ల అధ్యయనం తర్వాత..
- 13 సార్లు గడువు పొడిగింపు
- 25 శాతం కులాలకే 97 శాతం ఉద్యోగాలు
- లభిస్తున్నట్లు 2018 నాటి పరిశీలనలో వెల్లడి

# సాంపాదకీయం

## మోదీని ప్రశ్నించే 'స్వదేశీ' యోధులేరీ?

సిద్ధాంతాలు ఏవైనా ఒక సంస్థలో పనిచేస్తూ తాము అనుకున్న విలువలకు కట్టుబడి ఉంటూ, జీవితంలో రాజీపడని వారు అనేకమంది ఉంటారు. గత వారం బెంగళూరులో మరణించిన ఆర్‌ఎస్‌ఎస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి మదన్‌దాస్ దేవి అలాంటి వారిలో ఒకరు. ఆయనను స్మరించుకునేందుకు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం సభను ఏర్పాటు చేసినప్పుడు స్టేడియం వేలాది మందితో కిక్కిరిసిపోయి కనిపించింది. దేశ వ్యాప్తంగా నలుమూలలనుంచి సంఘ్, బీజేపీ నేతలు, కార్యకర్తలు ఈ సభకు హాజరయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, పలువురు కేంద్రమంత్రులు, సీనియర్ ఆర్‌ఎస్‌ఎస్ నేతలు దత్తాత్రేయ హొసబలే, సురేశ్ సోని, కృష్ణ గోపాల్‌తో పాటు పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మొదలైన వారెందరో ఈ సమావేశంలో కనపడ్డారు. ఇంతకీ ఈ మదన్‌దాస్ దేవి ఎవరు? గత కొద్ది సంవత్సరాలుగా చురుకుగా లేనప్పటికీ ఆయనను అనేకమంది ఎందుకు తలచుకుంటున్నారు? షోలాపూర్‌కు చెందిన మదన్‌దాస్ దేవి వృత్తి రీత్యా ఛార్టర్డ్ అకౌంటెంట్. అయితే వృత్తిని పక్కన బెట్టి పూర్తి కాలం సంఘ్ కార్యకలాపాల్లో తలమునకలయిన దేశభక్తుడు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా దేశం నలుమూలలా అఖిల భారత విద్యార్థి పరిషత్‌ను నిర్మించారు. అంతేకాదు, దత్తోపంత్ ఠేంగడి, ఎంజి బొకారే ఇతర నేతలతో కలిసి 1991లో స్వదేశీ జాగరణ్ మంచ్‌ను నిర్మించారు. ఏబీవీపీలో అరుణ్ జైట్లీ, వెంకయ్యనాయుడు, రవిశంకర్ ప్రసాద్, నడ్డా వంటి నేతలను రూపొందించడంలో ఆయన పాత్ర ఉన్నది. అన్నిటికన్నా మించి అటల్ బిహారీ వాజపేయి హయాంలో బీజేపీకి, ఆర్‌ఎస్‌ఎస్‌కు మధ్య సంబంధాలను ఏర్పర్చడంలో మదన్‌దాస్ దేవి కీలకపాత్ర చరిత్ర పుటల్లో నమోదైంది. స్వదేశీ జాగరణ్ మంచ్‌ను ఒక శక్తిగా రూపొందించి భారత దేశ ఆర్థిక విధానాలపై దాని ప్రభావం చూపేలా చేయగలిగిన మదన్‌దాస్ దేవి భారతదేశాన్ని పాశ్చాత్య దేశాలు కేవలం ఒక మార్కెట్‌గా భావించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

# సహాయక చర్యలేం చేపట్టారు..?

(మొదటి పేజీ తరువాయి)

అలాగే భవిష్యత్‌లో వరదలతో ఎలాంటి నష్టం వాటిల్లకుండా శాశ్వత నివారణ చర్యలు ఏం చేపట్టారో వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ 2020లో ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. తాజా వర్షాలు, వరదల నేపథ్యంలో దీనికి సంబంధించి ఓ మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలైంది. ఈ ఐఏపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. 'వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులపై ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలి. వాతారణ శాఖ హెచ్చరికలకు అనుగుణంగా భవిష్యత్ చర్యలు చేపట్టాలి. బాధితులను గుర్తించి పునరావాసం సహా ఇతర సహాయక చర్యలు చేపట్టాలి. బాధితుల కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలి. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి..' అని సూచించింది.

# ఓబీసీ ఉప వర్గీకరణపై

న్యూఢిల్లీ: ఇతర వెనకబడిన తరగతుల (ఓబీసీ) ఉపవర్గీకరణపై అధ్యయనానికి ఏర్పాటైన రోహిణి కమిషన్ ఎట్టకేలకు రాష్ట్రపతికి నివేదిక సమర్పించింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జీ రోహిణి చైర్‌పర్సన్‌గా 2017 అక్టోబరు 2న ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. నాటి నుంచి 13 సార్లు కమిషన్ గడువును కేంద్రం పొడిగించింది. తాజా గడువు జూలై 31తో ముగియనుండగా అదే రోజున రాష్ట్రపతికి కమిషన్ తన నివేదికను అందజేసింది. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయశాఖ ఒక ప్రకటన చేసింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ నివేదిక రావటం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో ఓబీసీలకు 27% రిజర్వేషన్ ఉంది. అయితే, కేంద్ర ఓబీసీ జాబితాలో ఉన్న 2,600 కులాల్లో కొన్నే ఈ రిజర్వేషన్ లబ్ధిని అధికంగా పొందుతున్నాయన్న అభిప్రాయం చాలాకాలంగా ఉంది. రిజర్వేషన్ ఫలాలు సమానంగా పంపిణీ అయ్యేలా ఓబీసీ కోటాలో ఉప వర్గీకరణ చేయాలన్న డిమాండ్ కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే రోహిణి కమిషన్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. కమిషన్‌కు కొన్ని మార్గదర్శకాలను పొందపరిచింది. అవి, 1. ఓబీసీలలో రిజర్వేషన్ ప్రయోజనాల అసమాన పంపిణీ ఏ మేరకు ఉందో అధ్యయనం చేయటం 2. ఓబీసీలలో శాస్త్రీయంగా ఉపవర్గీకరణ చేయటానికి అవసరమైన యంత్రాంగం, ప్రాతిపదిక, పద్ధతులు, ప్రమాణాలను నెలకొల్పటం 3. ఒకే విధమైన ఉపకులాలను గుర్తించి, ఆ మేరకు వేర్వేరు తరగతులుగా ఓబీసీ కులాలను వర్గీకరించటం. కమిషన్‌ను తొలుత ఏర్పాటు చేసినప్పుడు 12 వారాల గడువు ఇచ్చారు. 2018 జనవరి 3తో ఆ గడువు ముగిసినప్పటికీ అప్పటి నుంచీ పలుమార్లు గడువు పొడిగించారు. ఓబీసీల జనగణనపై అఖిల భారత స్థాయిలో సర్వే చేపట్టటానికి వీలుగా బడ్జెట్ కేటాయించాలని 2018 డిసెంబరు 12న కేంద్రానికి కమిషన్ లేఖ రాసింది.


# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం
# 20 మంది మృతి

తెల్లవారుజామున సంభవించింది. ఎక్స్‌ప్రెస్ వే మూడో దశ పనుల్లో భాగంగా చేపట్టిన బ్రిడ్జి నిర్మాణంలో 15, 16 నంబర్ల పిల్లర్లపైకి బీమ్‌లను తీసుకెళుతుండగా దాదాపు 100 అడుగుల ఎత్తు నుంచి బీమ్‌లతో సహా ఆ క్రేన్ ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు కాంట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ బ్రిడ్జిని నవయుగ ఇంజనీరింగ్, సింగపూర్‌కు చెందిన వీఎసఎల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు నిర్మిస్తున్నాయి. ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. మహారాష్ట్ర సీఎం శిందే మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ముంబై-నాగ్‌పూర్‌లను కలుపుతూ దాదాపు 701 కి.మీల పొడవునా ఈ ఎక్స్‌ప్రెస్ వేను నిర్మిస్తుండగా, ఇప్పటికే 600 కి.మీల నిర్మాణం పూర్తైంది.

# నగ్నం అయ్యింది నేను కాదు, నగ్నం అయ్యింది మొత్తం దేశమే

నలుగురు మగాళ్ల గుమికూడిన చోట నడవాలి అంటే నా కాళ్ళు తడబడేటివి, అలాంటి నన్ను వేల మగాళ్ళ ముందర నగ్నంగా తిప్పారు..ఇంటికి నాన్న స్నేహితులు వస్తే తలుపుల చాటున ఉండే దాన్నీ, భలే సిగ్గ నాకు... అలాంటి నన్ను నగ్నంగా రహదారుల వెంట తిప్పుతూ ఉంటే ఇంత చాటు కోసం పరితపించా....దొరికితే గా .ఈ ఆటవిక కిరాతకుల సంతతి మధ్య... ఎవరిది తప్పో, ఎవరిది న్యాయమో, ఎవరు ఎవరికి అన్యాయం చేశారో, శిక్ష మాత్రం ఏ తప్పు చేయని నాకు వేశారు... నా జీవితాంతం మరచి పోలేని పీడ కలను మిగిలిచ్చారు... నేను ఆడదాన్ని నాకు మానం ఉంటుంది అని ఆ దుర్మార్గులు అంతా మరిచారు... నగ్నంగా ఊరేగాకా నేను మహిళను అన్న విషయన్నే మరిపించేశారు.. జీసస్ ను పిలిచా, అల్లాహ్ ను పిలిచా, కృష్ణుడిని పిలిచా, ఈ అవమానం నుంచి కాపాడమని, అందరూ ఆ దుర్మార్గుల వైపే ఉన్నారు ఏమో, నిరాటంకంగా సాగింది నా నగ్నత్వ ప్రదర్శన.. నా నగ్నత్వం నడి బజారులో వినోద వస్తువు అయిపోయింది అని తల్లడిల్లింది నా మనస్సు... నా కన్నీళ్లకు కూడా విలువ లేకుండా పోయింది... చేతులు జోడించి భంగ పడితే, ఈ భంగిమ కూడా భలే ఉంది అంటూ కేరింతలు కొట్టారు కలియుగ దుశ్శాసనులు... ఎక్కడో విన్నా మన దేశపు సైన్యం చాలా బలమైనది అంట గా, ఎందులో నన్ను కాపాడటంలోనా, లేక ఈ కీచకులకలకు వంతు పాడటంలోనా.. అమ్మా అని గొంతు ఎత్తి అరవాలి అనిపించింది సహాయం కోసం, ఎక్కడ నా గొంతు విని తల్లడిల్లి నా తల్లి పరుగెత్తుకు వస్తే తన్ను కూడా నాతో పాటు నగ్నంగా ఊరేగిస్తారు ఏమోనని అరుపును నా గొంతులోనే సమాధి చేసుకున్నా...నేను సమాధి అవడానికి సిద్ధ పడ్డా...

అరవకున్నా, పిలవకున్నా వచ్చాడు నన్ను ఆ కిరాతకుల నుంచి కాపాడటానికి నా తోబుట్టిన వాడు..కృష్ణుడి కంటే గొప్పవాడు నా తమ్ముడు, మాయలు తెలియవు, శక్తులు లేవు, అయినా ఎదురు తిరిగాడు కౌరవ సంతతికి..అచ్చం పద్మ వ్యూహంలో చొరబడ్డ అభిమన్యుడిలా..విష సర్పాల కాటుకు బలి అయిపోయాడు క్షణాల్లో... కౌరవ సంతతి వంద అని విన్నాను, తప్పుగా నేర్చుకున్నాను ఏమో బళ్ళో, కాదు రెండు వేల మంది అని తెలియజేసి, శిక్షగా నగ్నంగా నిలబెట్టారు... కౌరవులు కేవలం వస్త్రాహరణం చేద్దాము అనుకున్నారు అంతే, ఈ కౌరవులు నా వస్త్రాలతో పాటు మానాన్ని హరించారు...నాలోని ఆత్మను అపహరించారు ...లేదు, లేదు ...హత్య చేశారు... ఓ ధర్మ దేవత ఎక్కడ ఉన్నావు ఆ రోజు, ఆ కళ్లకు గంతలు ఎందుకు, ఈ దేశంలోని ఏ శక్తి నన్ను కాపడలేక పోయింది, నీ మీద ఆశలు లేవు కూడా, కనీసం ఆ కళ్లకు కట్టుకున్న బట్ట నైనా ఇస్తావు ఏమో నని ఆశ పడ్డా, నా ఆడతనానికి అది అడ్డుగా అయినా నిలబడతుంది కదా అని...అయినా నువ్వు కూడా ఆ కౌరవుల జట్టే కదా ఇప్పుడు....లేదా



కళ్ళకు గంతలు విప్పితే నా నగ్న దేహం కనిపిస్తే ..సాక్షి గా మిగులుతావు అని భయ పడ్డావా...కౌరవ సంతతికి శిక్ష పడుతుంది అని కంగారు పడ్డావా.... ఆత్మను చంపారు, నేలా పై వేసి నా శరీరాన్ని చిద్రం చేయడం మొదలు పెట్టారు... ఒకరి తరువాత ఒకరు...ఒకరి తరువాత ఒకరు, ఇనుప చువ్వలను కాల్చి నా దేహంలో గుచ్చుతున్నట్లు.. పైన పడ్డారు పశువులు, నేను మాంసపు ముద్దను అయ్యాను, నాకు నొప్పి, బాధ ఉంటాయని మరిచారు ఆ కామంధులు...అప్పటి వరకు పడ్డ బాధ పదింతలు అయ్యింది.... పశువులకు కనికరం లేదు, పైన పడి చిత్రహింసలు పెడుతున్నారు, నేల తల్లిని ప్రార్థించా...

సీతను కలుపుకున్నావు అంటగా నీలో, నేనూ సీత అంతటి పవిత్రరాలునే...ఈ క్రూరులు చెర బట్టే వరకు...నన్ను కబళించు తల్లీ...ముష్కరుల కబంధ హస్తాల నుంచి నన్ను కాపాడు... ఏడిచి ప్రాధేయ పడటానికి కళ్ళల్లో నీళ్లు కూడా మిగల్లేదు తల్లి, తండ్రి హత్యను చూశా, తమ్ముడి పాశవిక మరణాన్ని చూశా, ఒక్కో అడుగు నగ్నంగా నడుచుకుంటూ వచ్చా...ఆ బాటలోనే అడుగింటి పోయాయి కన్నీళ్లు ... ఇంకెక్కడి నుంచి త్యాను కన్నీళ్లు, ఎలా కరిగించను నీ కఠిన మనస్సు..నువ్వు ఆడదానివే గా...ఒక అభాగ్యురాలి పై జరుగుతున్న అత్యాచారం నిన్ను కదిలించుట లేదా... కనికరి%శీ%చ లేవా...కటిక, గరుకు నేల పైనేగా ఈ దుర్మార్గులు నన్ను హింసించి వికృతానందం పొందుతున్నారు...నా బాధ నీకు తెలియడం లేదా.....

నా ఏడుపు నీ వరకు చేరట్లేదా...నీ చెవులకు చేరేలా అరవలేను తల్లీ ...ఒంటి పై బట్ట లేదు...వంట్లో శక్తి లేదు.....ఒక వేళ గట్టిగా అరిస్తే నా అరుపులు ఇంకొందరు కిరాతకులుకు చేరి వారు వీరితో కూడితే.....నా మరణ భయం నాది తల్లీ అర్థం చేసుకో.... ఓహో ధర్మ దేవత చూడ లేదు, నువ్వు విన లేవా.. ధర్మ దేవత గుడ్డిది, నువ్వు చెవిటి దానివి అయ్యావా...ఇది విన్నారా అయ్యా భూమాత చెవిటిది అంటా..హాహా హాహా....హాహా హాహా నా బహిరంగ నగ్న ప్రదర్శన మీలో చలనం కలిగించుట లేదా, కోపం రాలేదా, రక్తం సలసల మరగ లేదా...ఓహో ఇది అంతా సామాన్యంగా తోచిందా... అవును లే..మీ ఇంట్లో వారు అందరూ నగ్నంగా ఊరేగుతుంటారు ఏమో నూలు పోగు లేకుండా...అందుకే అంతా సామాన్యంగా తోస్తోంది మీకు... హాహా హాహా, హాహా హాహా... ఏంటి నవ్వుతున్నాను, ఏడ్వకుండా అత్యాచారం జరిగేటప్పుడు అని తప్పు బడుతున్నారా... అలా ఏడిచేది ప్రతివ్రతలు కదా...నేను కాదు...అవును నేను ప్రతివ్రతను కాను...కుకీ జాతి స్త్రీని...ఈ రోజు నా దేహం పై వేల మందికి హక్కు కల్పించబడింది, పాలిస్తున్న వారిచే. ఇంకెక్కడి ప్రాతివ్రత్యం... హాహా హాహా హాహా... ఏడ్వాలి అన్నా భయంగా ఉంది...అత్యాచారం చేస్తున్న ముష్కరులు, నా యోనిలో ఆవిరి అయిపోయిన తడిని నా కన్నీటి చుక్కలతో భర్తీ చేస్తారు ఏమో వారి సౌలభ్యం కోసం...అందుకే ఏడ్వను...అందుకే ఏడ్వను..నవ్వుతాను హాహా హాహా...హాహా హాహా... నేను నడుస్తున్న శవాన్ని. నాలోని ఆత్మను చంపేశారు...నా కళ్లలోకి చూడండి...జీవం ఎక్కడో లోతుల్లో దాక్కుంది... కళ్లలోకి రావడానికి సిగ్గు బడుతోంది...సిగ్గు బడుతోంది......నా నగ్న దేహాన్ని చూసింది కదా... హాహా హాహా... హాహా హాహా... ఇప్పుడు బట్టలు వేసుకున్నా కూడా, నగ్నంగా తిరుగుతున్నట్లే ఉంది...అద్దం ముందర నిలబడ్డా ఎదురుగా నా నగ్న దేహమే...నా నగ్న దేహం పై నాకు ద్వేషం....ఇతరుల ముందు సంతలో పశువులా తిప్ప బడింది ఈ నగ్న దేహమే...ఈ దేహం అంటే ద్వేషం..ద్వేషం... హాహా హాహా.... నగ్నం అయ్యానా నేను, లేదు, నగ్నం అయ్యనా నేను, లేదు...నగ్నం అయ్యింది మీరు, దేశ జనాభా మొత్తం... హాహా హాహా... హాహా... నగ్నం అయ్యానా నేను, లేదు, నగ్నం అయ్యనా నేను, లేదు..నగ్నంఅయ్యింది మొత్తం దేశం.. మానవత్వం ముందు, నగ్నం అయ్యింది మొత్తం దేశం.. ప్రపంచం పటం ముందు... హాహా హాహా.. హాహా మీకు లేని సిగ్గు నాకెందుకు, ముడుచుకొని ఇంట్లో కూర్చుంటాను అనుకుంటున్నారా..హాహా హాహా.. మనసున్న, మానవత్వం ఉన్న ప్రతి వాడి అక్షరంలో ధైర్యంగా కనిపిస్తూ ఉంటా..మిమ్మలిని ప్రశ్నిస్తూ ఉంటా...మీరు సిగ్గుతో చచ్చేలా చేస్తా.....చావండి సిగ్గు లేని బ్రతుకులు మీవి....చేవ లేని జీవితాలు మీవి..మీకెందుకు రా తల్లీ చెల్లీ, యాలి...నగ్నంగా ఊరేగిస్తారా...గుంపులతో అత్యాచారం జరిపిస్తారా....హాహా హాహా... హాహా హాహా.... ఎవడో నా కోసం మొసలి కన్నీరు కార్చాడు అంట గా, దుర్ఘటన జరిగిన వారాలా తరువాత.. కన్నీటి చుక్కలు కావు అవి..విషపు చుక్కలు అవి..విషపు చుక్కలు అవి.. జాగ్రత్త ...తస్మాత్ జాగ్రత్త....

-- ఇమ్రాన్ బేగ్

# అన్నాభావు సాఠేకు భారతరత్న ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

వర్గానికి చెందిన మహాకవి అన్నాభావుసాఠే రచించిన గ్రంథాలను దేశంలోని అన్ని భాషల్లోకి అనువదించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. దేశం గర్వించదగ్గ ప్రజాకవి అన్నాభావు సాఠేకు పాలకులు సరైన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అట్టడుగు కులంలో పుట్టి జీవితాన్ని వడబోసిన దళితబిడ్డ, దేశ మూలవాసి అన్నాభావు సాఠేను భారతరత్నతో గౌరవించుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. మహారాష్ట్రలోని ఏక్‌నాథ్‌షిండే ప్రభుత్వం ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ పరంగా తాము కూడా ఇందుకోసం ప్రయత్నం చేస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పక్షాన ప్రధాని మోదీకి తాను లేఖ రాస్తానని వెల్లడించారు.

**సాఠే రచనలు అన్ని భాషల్లో రావాలి**

సాఠే రచనలు, సాహిత్యం, అణగారిన వర్గా ల కోసం ఆయన పోరాటం అజరామరం అని సీఎం కేసీఆర్ అన్నారు. కమ్యూనిస్టుగా, అంబేదరిస్టుగా సమసమాజ స్థాపనకోసం జీవితాం తం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అన్నాభావుసాఠే అని కొనియాడారు. అన్నాబావు సాఠేను మహారాష్ట్ర ప్రజలు అమరకవిగా కీర్తిస్తున్నారని చెప్పారు. 'రచనలు అందరూ చేస్తారు. కానీ, సమాజహితంకోసం, సమాజంలోని పీడితు లు, వంచితుల కోసం, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం రాసేవాళ్లు చాలా అరుదుగా ఉంటా రు. అలాంటివారిలో అగ్రగణ్యుడు అన్నాభావ్‌సాఠే' అని శ్లాఘించారు. తాను నమ్మిన సిద్ధాం తం కోసం ఏనాడూ వెనుకడుగు వేయకుండా జీవితాంతం ప్రజలతో ఉన్నారని అన్నారు.

అన్నాబావు సాఠేను రష్యా గుర్తించింది కానీ మనదేశం గుర్తించలేదని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. 'అన్నాబావు సాఠేను రష్యాకు పిలిచి గౌరవించారు. రష్యా లైబ్రరీ ముందు ఆయన విగ్రహాన్ని పెట్టారు. ప్రపంచంలోని సాహిత్యాభిలాషులందరికీ మాక్సిం గోర్కి ఏ స్థాయిలో తెలుసో, మహారాష్ట్రలో సాఠే అంతటి సుపరిచితుడు. గోర్కి రాసిన 'అమ్మ' నవల ప్ర పంచంలోని అన్ని భాషల్లోకి అనువాదం కావటం వల్ల గోర్కి మనకు తెలుసు. గోర్కిలాగే సా ఠేకు అంతటి గౌరవం ఉన్నది. అందుకే ఆయనను 'ఇండియన్ మాక్సింగోర్కి'గా కీర్తిస్తున్నా రు. తన రచనల ద్వారా అణగారిన వర్గాలను చైతన్యపర్చిన సాఠేను భారత పాలకులు గుర్తించకపోవడం, ఆయన సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయకపోవటం శోచనీయం. సాఠే త్యాగాలను ఇప్పటికైనా మహారాష్ట్ర, కేంద్ర ప్ర భుత్వాలు గుర్తించాలి. ఆయన రచనలను అన్ని భారతీయ భాషల్లోనే కాకుండా విదేశీ భాషల్లో కి అనువదించే ప్రక్రియను చేపట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాఠే విశ్వజనీన, లోకహిత తత్వాన్ని పరిచయం చేయాలి.

# గురుగ్రామ్‌లో ఇమామ్ హత్య

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ ప్రకటనకు ప్రతిపక్షాలు పట్టుబడుతుండగానే.. ఢిల్లీ పొరుగునే ఉన్న హరియాణాలో అల్లర్లు మొదలయ్యాయి. సోమవారం సాయంత్రం వీహెచ్‌పీ చేపట్టిన బ్రిజ్ మండల్ జలాభిషేక యాత్ర నూహ్ జిల్లా నంద్ గ్రామం వద్దకు చేరుకోగానే ఓ వర్గం వారు దాడికి దిగడం.. పరస్పరం రాళ్లు రువ్వుకోడం.. కాల్పులు.. వాహనాల దహనం.. ఇద్దరు హోంగార్డుల మృతి తదితర పరిణామాల ఉద్రిక్తత మంగళవారం కూడా కొనసాగింది. అల్లర్లు ఢిల్లీ శివారు గురుగ్రామ్‌కూ పాకడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. కాగా, సోమవారం అర్ధరాత్రి గురుగ్రామ్ సెక్టార్ 57లోని అంజుమన్ మసీదుపై దాడికి దిగిన మూకలోని కొందరు కాల్పులు జరపడంతో నాయబ్ ఇమామ్ మౌలానా సాద్ (26) మృతిచెందాడని పోలీసులు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన ఇతడిది బిహార్ రాష్ట్రమని పేర్కొన్నారు. కాల్పుల్లో మరో వ్యక్తి కూడా గాయపడ్డాడని, ప్రార్థనా మందిరానికి మూక నిప్పు పెట్టిందని పోలీసులు చెప్పారు. మరోవైపు నూహ్ జిల్లాలో కర్ఫ్యూ విధించారు.

# రూపు మారుతున్న ఉత్తరాంధ్ర

(మొదటి పేజీ తరువాయి)

మీదుగా శంకుస్థాపన జరిగింది. ఏయూలో రూ.130 కోట్లతో నిర్మించిన 5 భవనాలను సీఎం ప్రారంభించారు. దక్షిణాదిలో అతి పెద్దదైన ఇనార్బిట్ మాల్‌తో పాటు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ స్పేస్, కన్వెన్షన్ సెంటర్‌ను కూడా తర్వాత దశలో రహేజా సంస్థ నిర్మించనుందని సీఎం జగన్ చెప్పారు. లగ్జరీ హొ టళ్ల నిర్మాణానికి కూడా రహేజా ఆసక్తి చూపుతోందన్నారు. కేటాయించిన మొత్తం స్థలం విస్తీర్ణం 17 ఎకరాలు కాగా 12-13 ఎకరాల్లో మాల్ ఏర్పాటు కావడం చాలా తక్కువ ప్రాంతాల్లో మాత్రమే జరు గుతుందన్నారు. ఇదే రహేజా గ్రూప్ హైదరాబాద్ లో ఇనార్బిట్ మాల్‌ను 7-8 ఎకరాల్లో నిర్మించగా విశాఖలో 12-13 ఎకరాల్లో నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని గుర్తు చేశారు. గత పర్యటన సందర్భంగా విశాఖలో అదానీ డేటా సెంటర్, ఐటీ స్పేస్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశామన్నారు. అలాగే అంతకుముందు శ్రీకాకుళం జిల్లా మూలపేటలో పోర్టుకు శంకుస్థాపన చేసుకున్నామని గుర్తు చేశారు. ఇవన్నీ రానున్న రోజుల్లో విశాఖ, ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చుతాయన్నారు. మాల్ కూడా అదే కోవలోకి వస్తుందన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే... ఇంత భారీ మాల్ ఏర్పాటుతో విశాఖ రూపురేఖలు మారడమే కాకుండా దక్షిణాదిలో అతి పెద్దదిగా నిలవనుంది. 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. 12-13 ఎకరాల్లో మాల్ నిర్మాణం పూర్తయ్యాక రెండో దశ కింద మిగిలిన 4 ఎకరాల్లో 2.5 లక్షల చదరపు అడుగుల్లో ఐటీ స్పేస్

# అంబులెన్స్..15 నిమిషాల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

దాని తాతలాంటి మహమ్మారులు వచ్చినా ఎదుర్కొనేలా వైద్యరంగం సిద్ధంగా ఉన్నది' అని స్పష్టం చేశారు.ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వంపై భరోసా పల్లె దవాఖానలు, బస్తీ దవాఖానలతో ప్రజలకు వైద్యం మరింత చేరువ చేశామని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోని దవాఖానల్లో కనీసం 100 పడకలు అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో 17 వేల పడకలు ఉండేవని గుర్తు చేశారు. దవాఖానల అప్‌గ్రేడేషన్, జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, నగరం నలువైపులా నాలుగు టిమ్స్ దవాఖానలు, వరంగల్ హెల్త్ సిటీ, నిమ్స్ విస్తరణ ద్వారా ప్రభుత్వ దవాఖానల్లో పడకల సంఖ్య 50 వేలకు పెరిగిందని తెలిపారు. 'మాకు ఎలాంటి అనారోగ్యం వచ్చినా కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉన్నదనే భరోసా ప్రజల్లో కలిగింది' అని చెప్పారు. 'బిడ్డ కడుపులో పడగానే కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, తర్వాత కేసీఆర్ కిట్, న డక వచ్చిన తర్వాత అంగన్వాడీ కేంద్రాలు, చదువుకోవాలనుకునేవారికి గురుకులాలు, స్కాలర్‌షిప్‌లు, స్వరాష్ట్రంలోనే ఉపాధి, ఆడబిడ్డ పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వృద్ధులకు పింఛన్లు.. ఇలా ప్రతిదశలోనూ ప్రభుత్వం సాయం చేస్తున్నది' అని వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో గతంలో 30 శాతం ప్రసవాలు జరిగితే ఇ ప్పుడు 70 శాతం అవుతున్నాయన్నారు. ఇందులో ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశా కార్యకర్తల సెల్ ఫోన్ బిల్లును ఇకపై ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. హైదరాబాద్ పరిధిలో కొత్త ఆశా కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లు ఇవ్వనున్నట్టు తెలిపారు.

అత్యవసర సేవలు అందించే 466 అధునాతన వాహనాలను ఒకేరోజు ప్రవేశ పెట్ట డం తనకు సంతోషంగా ఉన్నదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. తెలంగాణ ఏర్పడే నాటికి 108 అంబులెన్స్‌లు 316 ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 455కు పెరిగిందని, లక్ష మందికి ఒక 108 వాహనం ఉంటే.. ఇప్పు డు 75 వేలకు ఒక వాహనం అందుబాటులోకి వచ్చిందని వివరించారు. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు 2014 నాటికి ఒక్కటి కూడా లేదని, ఇప్పుడు జిల్లాకు ఒక టి ఏర్పాటు చేశామని చెప్పారు. గతంలో నవజాత శిశువుల కోసం అంబులెన్స్‌లు లేవని, ఇప్పుడు జిల్లాకు ఒకటి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దేశంలోనే అందరికన్నా ముందు వరుసలో నిలిచామని తెలిపారు. 108లో పనిచేస్తున్న పైలట్లు, టెక్నీషియన్లు, ఇతర ఉద్యోగుల వేతనాలను 4 స్లాబులుగా పెంచుతున్నట్టు చెప్పారు. 108 ద్వారా రో జుకు 2 వేల మంది, అమ్మ ఒడి వాహనాల తో రోజుకు 4 వేల మంది సేవలు పొందుతున్నారని చెప్పారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం పెద్ద కుంభకోణం

- సీఎం, సిఎస్, మంత్రి, అధికారులపై కేసు నమోదు చేయాలి
- డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో అవినీతి జరుగుతుంటే కేంద్రం ఏం చేసింది..?
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో జరిగిన అవినీతి నిరూపించడానికి నేను సిద్ధం
- చర్చకు సీఎం ఆయన కొడుకు కూతురు అల్లుడు ఎవరు వచ్చినా ఆధారంతో సహా చూపిస్తాం
- తెలంగాణ ప్రజలను మోసం చేసిన కేసీఆర్ కు బుద్ధి చెప్పాలి
- తెలంగాణ ఆత్మగౌరవ వేదిక అధ్యక్షురాలు ఇందిరా శోభన్



**హైదరాబాద్, ఆగస్టు 01, సమ సమాజం:** తెలంగాణలో అమల్లో ఉన్న డబుల్ బెడ్రూం ఇల్ల నిర్మాణ పథకం పెద్ద కుంభకోణం అని, దీనికి బాధ్యులైన సీఎం, సిఎస్, మంత్రిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని తెలంగాణ ఆత్మగౌరవ వేదిక అధ్యక్షురాలు ఇందిరా శోభన్ డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మంజూరైన ఇళ్ల వివరాలను ఆర్.టి.ఐ ద్వారా వెలుగులోకి తీసు కొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2004 - 2014 వరకు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 22,89,829 ఇల్లు గత పాలకులు నిర్మించారన్నారు. అన్ని స్కీముల కింద 4240753 ఇండ్లు జూన్ 2 2014 వరకు పూర్తయినవి. కెసిఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూరల్ లో 1,25, 598 ఇళ్లు, అర్బన్ లో 1,70,459 ఇల్లు నిర్మిస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారన్నారు. అయితే 9 ఏళ్ల కేసీఆర్ పాలనలో ఇప్పటివరకు పూర్తయిన ఇల్లు చూస్తే సిగ్గు అనిపిస్తుంది అన్నారు. పార్టీ ద్వారా 2018 మార్చి నాటికి మొదటి విడత కింద 1,979 ఇల్లు మాత్రమే పూర్తి చేశారన్నారు. 2022 జనవరి నాటికి 13,723 ఇల్లు పూర్తయ్యాయన్నారు. 2023 మే నాటికి 46973 ఇల్లు లబ్ధిదారులకు అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లక్ష ఇల్లు నిర్మిస్తామని చెప్పి కేవలం 4179 ఇల్లు మాత్రమే లబ్ధిదారులకు అంద చేశారన్నారు. ఇప్పటివరకు డబుల్ బెడ్ రూమ్ పూర్తయిన ప్రాంతాల్లో సీఎం అల్లుడు హరీష్ రావు, కుమారుడు కేటీఆర్, కూతురు కవిత ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గం ఎక్కువ ఇల్లు నిర్మించారన్నారు. ములుగు వికారాబాద్ నారాయణపేట ఇలాంటి తదితర గిరిజన మారుమూల ప్రాంతాల్లో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. ఎంతోమంది ఇల్లు లేక పేదలు ఇబ్బందులు పడుతుంటే లబ్ధిదారులు లేరని తప్పుడు లెక్కలు చూపించడం సిగ్గుచేటన్నారు. సీఎం బంధువులు మాత్రమే తమ నియోజకవర్గంలో ఇల్లు నిర్మిస్తుంటే మిగతా ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. మీ ప్రాంతంలో పేద ప్రజలు లేరా..,? వారికి ఇల్లు నిర్మించారా..? అని ప్రశ్నించారు. ఆత్మగౌరవాణి కెసిఆర్ కాళ్ళ కింద తాకట్టు పెట్టి ప్రజలను వంచించడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ముఖ్యంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి ఇప్పటివరకు 2,09,543 ఇల్లు మంజూరు చేసిందన్నారు. 26,654 కోట్లు బడ్జెట్లో కేటాయిస్తే ఖర్చు చేసినది 11853 కోట్ల 2 లక్షలు. హాడుకో నుంచి అప్పు తీసుకున్నది 8744 కోట్ల 76 లక్షలని జులై 5 2023 RTI లెక్కలు చూపిస్తున్నారు. ఫిబ్రవరి 2023 9694.76 cr హాడుకో అప్పు ఇచ్చింది అని మరొక RTI చెబుతుంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఽంద్రం నుంచి తీసుకున్న యుటిలైజేషన్ సర్టిఫికెట్ 3232.10 cr అని మే 17 2023 Rti లెక్కలు చెబుతున్నాయి. మీరు ఖర్చు చేసిన డబ్బులు 11853.02 cr లో హాడుకో అప్పు కేంద్రం ఇచ్చిన డబ్బులతోనే సరిపోయింది. మరి పేదల ఇండ్లకు మీరు పెట్టింది ఏంటి? డబుల్ ఇళ్ల నిర్మాణానికి మొదట్లో అసెంబ్లీ సాక్షిగా 5 లక్షలు ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చి ఇప్పుడు లేదనడం సిగ్గుచేటు అన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వాళ్లకు మూడు లక్షలు మాత్రమే ఇస్తామని చెప్పడం కెసిఆర్ మోసపూరిత విధానానికి నిదర్శనం అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం మొత్తం పెద్ద స్కామని, ఈ స్కామ్ లో కోట్ల రూపాయలు పెద్దల జేబుల్లోకి వెళ్లిపోయాయని ఆరోపించారు. దీనిపై ఆధారాలతో సహా నిరూపించేందుకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. తన సవాల్ ను స్వీకరించి కేసీఆర్ కానీ, ఆయన కుటుంబ సభ్యులు కానీ ఎవరు వచ్చినా చర్చించేందుకు తాను సిద్ధం అన్నారు. తెలంగాణ ప్రజలు కూడా ఆలోచించాలని మన ఆత్మగౌరవంతో ఆడుకుంటున్న కేసీఆర్ కు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణంలో జరిగిన అవినీతిపై తాను కోర్టులో పిల్ వెయ్యబోతున్నట్టు ఇందిరా శోభన్ తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గ్రామ ప్రాంతాలలో అసలు ఇవ్వనేలేదని అమలులోనే లేదని ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 2018 కేంద్రం నుంచి నేను తీసుకున్న ఆర్టీఐ లెక్కల ప్రకారం గ్రామీణ ప్రాంతానికి కూడా ఇండ్ల ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఆత్మగౌరవేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాకు డాక్టరేట్ పట్టా కావాలి... కానీ యూనివర్సిటీలు ఇచ్చే డాక్టరేట్ పట్టా వద్దు.

ప్రజలు గుర్తించి ఇవ్వగల డాక్టరేట్ పట్టా నాకు కావాలి. అందుకే ప్రశాంతంగా ఉన్న అడవుల్లో మందు పాతర్లు ఎందుకు పేలుతున్నాయి. అడవిలో ఉన్న గిరిజనుల జీవితాలు ఎందుకు పోలీసుల బూట్ల చప్పుళ్ళ కింద నలిగిపోతున్నాయి... వాకపల్లి లాంటి గిరిజన మహిళలు అత్యాచారాలకు ఎందుకు గురి అవుతున్నారు.. మిత్రులందరికీ నమస్కారములు.... ప్రపంచవ్యాప్తంగా మేధావుల దృష్టిని ఆకర్షించాలి... మనకంటూ ఒక ప్రత్యేకత కలిగి ఉండాలి. ఆది చెడు కానీ... మంచిగానీ పదిమంది నోళ్ళల్లో మనం నానాలి. దేశం కోసం పోరాడిన మహాత్మాగాంధీ గుర్తుకొస్తే.... గాంధీని చంపిన గాడ్సే గుర్తుకొస్తాడు. మంచి చేయాలనుకుంటే చెడు ఎదురవుతుంది. మంచి చెడ్డలను బేరీజు వేసుకొని ముందుకు సాగడమే మనిషి లక్ష్యం కావాలి. కలలు కనలేని వాడు... కలలో ఇతరులను ముంచెత్త లేని వాడు మనిషి కానే కాడు. స్వప్నిక జగత్తులో విహరించాలి. కష్టాల కడలిలో ఈదుతూ... సుఖాల తీరం చేరాలని ఆశయం ఉండాలి. కలలు కనలేని వాడు.. రేపంటే విశ్వాసంతో కూడిన నమ్మకం లేనివాడు.. నా దృష్టిలో వాడు మనిషే కాడు. గతంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిన వెంటనే.... ఎస్ వి. యూనివర్సిటీ క్యాంపస్లో పీ.హెచ్డీ చేద్దామని అనుకున్న కానీ కుటుంబం... రాజకీయాలు వాటిల్లో మునిగి తేలడంతో చదువును అటక ఎక్కించాను. నేను మాత్రం నిరంతర విద్యార్థిగానే ఉంటున్నాను. భారతదేశంలో ఏ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ చేయని పరిశోధన పీహెచ్డీ పట్టా కోసం నేను రీసెర్చ్ చేయబోతున్నాను.. మీ అందరి ఆశీర్వాదం ఉంటుందని ఆశిస్తున్నాను. సబ్జెక్టు.... నక్సలైట్లు అంటే ఎవరు? వారు విదేశీ శక్తులా? స్వదేశీ శక్తులా? అలజడులు.... ఆందోళనలు... ఉద్యమాలు.... మందు పాతర లు... మరణ హోమాలు... వారి లక్ష్యమా? శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే వారి ఉద్దేశ్యమా..? వారు అడవులను అంటి పెట్టుకొని గిరిజనుల దగ్గర ఆశ్రయం ఎందుకు పొందాల్సిన పరిస్థితి వచ్చింది..? శ్రీరాముడు దగ్గరనుంచి.,.. పాండవులు దాకా అడవుల్లో అజ్ఞాతవాస జీవితం గడిపారు. దేవుళ్ళు కూడా అడవులను సురక్షిత కేంద్రాలుగా మార్చుకొని అడవుల్లోనే ఉంటున్నారు. అది తిరుమల కొండ పైన వెలసిన కలియుగ వైకుంఠ భగవానుడు శ్రీ. వెంకటేశ్వర స్వామి కావచ్చు. అది యాదగిరి గుట్ట కావచ్చు. అది సింహాచలం కావచ్చు. పెంచల నరసింహస్వామి కోన కావచ్చు. అహోబిల నరసింహస్వామి దేవాలయం కావచ్చు. నేడు ఉద్యమకారుకులకి అడవులు కేంద్రాలు అయ్యాయి... బహుశా దేవుళ్ళ వారసులు నక్సలైట్లు అనుకుంటున్నారా... నక్సలైట్లు అడవుల్లోకి అడుగుపెట్టడం వలన గిరిజనుల జీవితాలు బాగుపడ్డాయా? రోడ్డున పడ్డాయా? ప్రశాంతంగా జీవిస్తున్న అడవి బిడ్డలకు నిలువు నీడ లేకుండా చేసిన... చేస్తున్న అడవి మాఫియా.. మైనింగ్ మాఫియా.. వీరి వెనక అధికార ప్రతిపక్ష పార్టీల రాజకీయ నాయకుల ప్రత్యక్ష పరోక్ష సహకారం ఎంతవరకు ఉంది? దేశంలో ఉండే పారా మిలటరీ బలగాలు పోలీస్ యంత్రాంగం



గిరిజనులని కాపాడడానికి ఉన్నాయా? గిరిజనుల జీవితాలను ధ్వంసం చేసే మైనింగ్ మాఫియా ప్రయోజనాలను కాపాడడానికి ఉన్నాయా? ఈ విషయంపై నేను పరిశోధన చేయబోతున్నాను. నక్సలైట్ ఉద్యమం ప్రారంభమైన పశ్చిమ బెంగాల్ రాష్ట్రం.... డార్జిలింగ్ జిల్లా.. నక్సల్ బరి నుంచి శ్రీకాకుళం దాకా వారి ఉద్యమం ఎట్లా వ్యాపించింది. తెలంగాణకు ఎట్లా ఎగబాకింది. అక్కడి నుంచి ఛత్తీస్గడ్. జారండ్ దాకా.

**ఎట్లా ఉద్యమం వెళ్ళింది. ఉద్యమంలో చనిపోయిన వాళ్ళ త్యాగాలు ఏమైనాయి.. విలువైన చదువుతున్న చదువులను వదిలి విద్యార్థులు...**

జన్మనిచ్చిన తల్లిదండ్రులను వదిలి అడవి బాట ఎందుకు పట్టారు ... సమాజంలో. అందరూ సమానంగా జీవించాలంటే కొంతమంది ప్రాణాలు కోల్పోక తప్పదని.. అటువంటి చావుల సిద్ధాంతం ఎందుకు విద్యార్థులు ఆమోదిస్తున్నారు.......విప్లవ పార్టీలు గ్రూపులు గ్రూపులుగా ఎందుకు విడిపోయారు.... చారు మజుందార్ నుంచి... కొండపల్లి సీతారామయ్య నుంచి తరిమెల నాగిరెడ్డి నుంచి.. చంద్ర పుల్లారెడ్డి నుంచి... పుచ్చలపల్లి సుందరయ్య నుంచి... చంద్ర రాజేశ్వరావు నుంచి.. రావి నారాయణరెడ్డి నుంచి. సోయబుల్లా ఖాన్ భందగీ... దొడ్డి కొమురయ్య చాకలి ఐలమ్మ నుంచి. ఉస్మానియా విద్యార్థి కెరటం జార్జిరెడ్డి నుంచి జంపాల చంద్రశేఖర్ దాకా.. మారోజు వీరన్న దాకా... బెల్లి లలితక్క దాకా. పెద్ది శంకర్ నుంచి.... మల్లోజుల కోటేశ్వరావు నుంచి.. నల్ల ఆదిరెడ్డి శీలం సురేష్ దాకా.. పౌర హక్కుల సంఘం నాయకులు న్యాయవాది పురుషోత్తం నుంచి డాక్టర్ రామనాథం దాకా... ఉద్యమంలో పనిచేసి కోవర్ట్ దాకా మారి సాంబశివుడిని.. కోనాపూరి రాములను చంపిన నయీమ్ గాడిదాకా... శాఖమూరి అప్పారావు నుంచి పటేల్ సుధాకర్ రెడ్డి దాకా పొట్టన పెట్టుకున్న సంఘ వ్యతిరేక శక్తి నయీమ్ దాకా.. నయుం ను ప్రోత్సహించిన చంద్రబాబు నాయుడు నుంచి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి దాకా.. అర్థం చేసుకున్నాను. కటకం సుదర్శన్ ఎందుకు అడివి బాట పట్టారు.... తుపాకి తూటాలకు ఎందుకు ఆహుతి అయ్యారు. ఇలాంటి విషయాలు మీ ముందు ఉంచ బోతున్నాను. నేను చేయబోయే పరిశోధన పైన దేశంలో ఉన్న విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు నాకు గైడ్ గా వ్యవహరించడానికి ఎవరు సుముఖత వ్యక్తం చేయడం లేదు. నిర్బంధాలు వచ్చి మీద పడతాయి.. తప్పుడు కేసులు పెట్టించుకుని జైళ్లకు పోవాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. ప్రశాంతంగా జీవిస్తున్న మమ్మల్ని మా..మానాన వదిలేయండి లాయర్ గారు అని నన్ను రిక్వెస్ట్ చేశారు. నేను తీసుకుపోయే సబ్జెక్టు పైన వారికి ఉన్న అవగాహన అంతంత మాత్రమే.. వారు జీతాలు కోసం బతుకుతారు. జీవితాలు బాగు చేద్దామని వారికి...... ఏ కోశానా లేదు. సమాజం ఏమైనా పర్వాలేదు. తాము మాత్రం బాగుండాలని కోరుకునే మనస్తత్వం నేటి మేధావులుది. అందుకే వీళ్ళు మేధావులు కాదు మేత ఆవులు. మేధావులు మౌనం దాల్చితే సమాజానికి అరిష్టము అనే అవగాహన ఉండదు. అందుకే రీసెర్చ్ లు అన్నీ కూడా చట్టు బండలు అయిపోయినాయి. యూనివర్సిటీలలో విద్యా బోధన కుంటు పడి పడకేసింది. యూనివర్సిటీ పాలకవర్గాలంతా అవినీతి రాజకీయాలతో నిండిపోయి ఉన్నారు. పరిశోధనలు శూన్యం. పీహెచ్డీ డాక్టరేట్ పట్టాలు.. పరిశోధక విద్యార్థుల దగ్గర ప్రొఫెసర్లు డబ్బులు తీసుకుని వాళ్లే సిద్ధాంత వ్యాసాలు రాస్తున్నారు. ఇక్కడ విద్యార్థి గురువు అయినాడు. గురువు విద్యార్థి అయినాడు. యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ పదవి పొందాలంటే............ కులము.... గ్రూపు రాజకీయాలు డబ్బు పలుకుబడి కలిగి ఉండడం ప్రథమ అర్హత. ప్రతిభతో పనేలేదు. దురదృష్టకర సంఘటన ఏదైనా ఉందంటే ..అక్షర జ్ఞానం లేని వాడు ముఖ్యమంత్రిగా ఉంటే వారి పార్టీకి సంబంధించిన వాళు ళ్ళ.. వాళ్ళ గ్రూపులో తిరిగే వాళ్లను .. రాజకీయ నాయకులకు ఉడిగం చేసే వాళ్లను.... క్యాంపస్ ను కుల కేంద్రాలుగా మార్చేవాళ్ళు... వాళ్ళ కులపోళ్లు పట్టుపడితే... ముఖ్యమంత్రి కాదనకుండా వైస్ ఛాన్సర్ పదవి విసిరేస్తే ఒళ్ళో వచ్చి వాలిపోతుంది. ముఖ్యమంత్రి రికమండేషన్ చేసి గవర్నర్ కు పంపిస్తే గవర్నర్ ఆమోద ముద్ర వేసి చవటలు దద్దమ్మలు ప్రొఫెసర్లు అయిన అడ్డ గాడిదలకు వైస్ ఛాన్సర్ పదవి పొందే అవకాశం కల్పిస్తారు. యూనివర్సిటీల పరిధిలో ఉన్న అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకులు ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులు ముఖ్యమంత్రి పైన తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి వైస్ ఛాన్సర్ పదవి తమ కులపోడు నియామకం జరిగేలాగా చూసుకుంటారు. ఆ పదవి పొందినవాడు పనికిమాలిన ఎదవ అయినా పర్వాలేదు. ఈ మధ్యకాలంలో ఎస్వీ యూనివర్సిటీ తిరుపతిలో ప్రొఫెసర్ తన స్టూడెంట్ ఎమ్మెల్యే అతనికి ....పీహెచ్డీ పట్టా రావడానికి సిద్ధాంత వ్యాసం రాసి ఇచ్చి... అతని మెప్పు పొంది అతనికి డాక్టరేట్ రావడానికి కారకుడు అయ్యాడు ప్రొఫెసర్. డాక్టరేట్ పట్టా అందుకున్నవాడు గురుభక్తికి మెచ్చి గురుదక్షిణ కోసం రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను ఒప్పించి తనకు పీహెచ్డీ పట్టా రావడానికి కారకుడైన ప్రొఫెసర్ ను ఎస్వీ యూనివర్సిటీలో ఈసీ మెంబర్గా నియామకం జరిగేలాగా చూసుకున్నాడు. ఇది విద్యా వ్యవస్థలో విలువలను ధ్వంసం చేయడమే కదా... నా సబ్జెక్టుకు గైడ్ గా వ్యవహరించడానికి వారికి వ్యవస్థ పైన.. పాలకుల.

**దోపిడి పైన... సమాజం పైన..**

స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. అవగాహన లేని వాళ్లంతా... యూనివర్సిటీలలో ప్రొఫెసర్లు నెల జీతగాళ్లు అయినారు. బాధ్యత లేని వారు... కులాన్ని తలకు ఎక్కించుకున్న వాళ్లు.. పనికిమాలిన రాజకీయ నాయకుల అడుగుజాడలలో నడుస్తూ... వర్గ.. కుల రాజకీయాలను వంట పట్టించుకుంటూ... యూనివర్సిటీలలో గ్రూపులు కడుతూ.. విద్యార్థులను కుల సంఘాల నాయకులుగా తయారు చేస్తూ.... విద్యార్థులకు సరైన శాస్త్రీయమైన విద్య బోధించకుండా వారి మనసులో కులబీజాలు నాటుతూ... విద్యార్థులను రాజకీయ పార్టీలకు ప్రైవేటు సైన్యం లాగా తయారు చేస్తున్నారు. అటువంటి ప్రొఫెసర్లను దగ్గర నుండి చూసే అవకాశం నాకు వచ్చింది. నేను తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ లో... ఎం.ఏ ...సోషియాలజీ చేశాను. 1990...1992. ఆ సమయంలో యూనివర్సిటీ విద్యార్థి సంఘ చైర్మన్ గా గెలిచాను. మాకంటే ముందు రెండు సంవత్సరాల క్రితం విద్యార్థి సంఘ ఎన్నికలు నిషేధించారు. నేను క్యాంపస్ లోనికి అడుగుపెట్టిన తర్వాత పెద్ద ఎత్తున పోరాటం చేసి నిషేధింపబడ్డ ఎన్నికలను తిరిగి నిర్వహించేలాగా పోరాటం చేసి విద్యార్థి సంఘ ఎన్నికలు పెట్టించుకుని కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం అయిన %చీ.నా.ఖ.×% బ్యానర్ పైన పోటీ చేసి గెలిచాను. నా తర్వాత విద్యార్థి సంఘం ఎన్నికలు.. ఎస్ వి యూనివర్సిటీలో అప్పటినుంచి ఇప్పటిదాకా ఎస్. వి. యూనివర్సిటీలో విద్యార్థి సంఘ ఎన్నికలు నిషేధించబడ్డాయి.నాకు ప్రొఫెసర్లు ...లెక్చరర్లు.... రీడర్లు..హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్స్... కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్.. యూనివర్సిటీ ప్రిన్సిపాల్... వారందరి జీవన విధానం బాగా వారి బతుకులు తెలిసినవాడిని. వారి దగ్గర నేను పరిశోధన చేయబోయే సబ్జెక్టు పైన సత్తా లేదని నాకు పూర్తిస్థాయిలో తెలుసు. అందుకే పీడిత తాడిత ప్రజలే నాకు గురువులుగా భావించాను. చిన్ననాటి నుంచి విద్యార్థి ఉద్యమాలతో విడదీయరాని సంబంధం కలిగిన వాడిని. ప్రజా ఉద్యమాలలో పెరిగినవాడిని. ప్రజల అవసరాలను గుర్తించగలిగినవాడిని. ప్రజలు ఇచ్చే డాక్టరేట్ పీ.హెచ్డీ నాకు కావాలి. లక్ష మంది బహిరంగ సభలో.. దేశంలో ఉండే మేధావులందరినీ ఒక వేదికపైకి రప్పించి 100 డప్పులు.. ప్రజా కళాకారుల పాటలు సమరశీల పోరాటాలు చేసే ఉద్యమ నాయకులు లక్షలాదిమంది ప్రజల సమక్షంలో డాక్టర్ పట్టా పొందుతాను. అందులకు అడవులను ఎంచుకున్నాను. అడవి బిడ్డల జీవన విధానం వాటిపైన రీసెర్చ్ చేయబోతున్నాను. ఎప్పటికీ మీ ఆదరణ ఉంటుందని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇట్లు. మీ. మిత్రుడు.. ఆర్. కరుణాకర్ .హైకోర్టు న్యాయవాది. ప్రశ్నించే గొంతు.

# తెలుగు లిఫ్టర్లకు పతకాల పంట




న్యూఢిల్లీ: గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిపలో ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్లు పల్లవి, హారిక, వెంకటకృష్ణ పతకాలతో సత్తా చాటారు. పల్లవి స్వర్ణం సహా మూడు పతకాలతో అదరగొట్టింది. జూనియర్ బాలికల 64 కిలోల విభాగంలో స్నాచ్‌లో 87 కిలోలు ఎత్తి స్వర్ణం గెలిచిన పల్లవి.. క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కిలోలతో రజతం, ఓవరాల్‌గా 196 కిలోలతో మరో రజతం ఖాతాలో వేసుకుంది. జూనియర్ బాలికల 59 కిలోల్లో హారిక క్లీన్ అండ్ జెర్క్‌లో 98 కిలోలు ఎత్తి పసిడి దక్కించుకుంది. ఓవరాల్‌గానూ 176 కిలోలతో కాంస్య పతకం సాధించింది. జూనియర్ బాలుర 73 కిలోల విభాగంలో వెంకటకృష్ణ 3 రజతాలు కొల్లగొట్టాడు. స్నాచ్‌లో 120 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచిన వెంకటకృష్ణ.. క్లీన్ అండ్ జెర్క్‌లో 151 కిలోలతో ద్వితీయ స్థానంతో పాటు ఓవరాల్‌గా 271 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు.

# జట్టు కూర్పుపై స్పష్టత ఉంది

టరౌబా: రానున్న ఆసియాకప్, వన్డే వరల్డ్‌కప్‌ల్లో బరిలోకి దిగే కాంబినేషన్‌పై టీమ్ మేనేజ్‌మెంట్‌కు స్పష్టత ఉందని ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తెలిపాడు. విండీస్‌తో సిరీస్‌లో జట్టు ప్రయోగాలు బెడిసికొట్టడంతో విమర్శలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. 'జట్టు కూర్పుపై కెప్టెన్ రోహిత్‌కు కోచ్ ద్రవిడ్‌కు పూర్తి స్పష్టత ఉంది. ఈ రెండు మెగా టోర్నీలకు ముందు మా చివరి వన్డే సిరీస్ ఇది. ఇందులోనే ప్రయోగాలు చేయగలం. అందుకే కొత్త కాంబినేషన్‌ను ప్రయత్నిస్తున్నాం. దీనిద్వారా జట్టు బలాబలాలపై ఓ అవగాహనకు రావచ్చు. ఇక ఆసియాక్‌పనకు ఎలాం టి కాంబినేషన్‌తో వెళ్లాలో ఇప్పటికే నిర్ణయించుకున్నాం' అని జడేజా వివరించాడు. మరోవైపు ఐపీఎల్ ద్వారా వస్తున్న అపార ధనంతో భారత క్రికెటర్లలో గర్వం పెరిగిపోయిందన్న కపిల్ దేవ్ వ్యాఖ్యలపై జడ్డూ స్పందించాడు. 'ఆయన ఎప్పుడన్నాడో నాకు తెలియదు. అయినా ఎవరి అభిప్రాయాలు వారివి. కానీ మాలో ఎవరికీ గర్వం లేదు' అని జడేజా అన్నాడు. జట్టు ఓటమిపాలైనప్పుడే ఈ తరహా కామెంట్లు వస్తుంటాయని జడ్డూ చెప్పాడు.



# తొలిసారి బాదేశారు

టరౌబా (ట్రినిడాడ్): తొలి రెండు మ్యాచ్‌ల్లో పూర్తిగా తేలిపోయిన భారత బ్యాటర్లు.. సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌లో మాత్రం కదం తొక్కారు. తొలిసారిగా తమ స్థాయికి తగ్గ ఆటతీరుతో బ్యాట్లు ఝుళిపించగా, బ్రయాన్ లారా స్టేడియంలో పరుగుల వరద పారింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (92 బంతుల్లో 11 ఫోర్లతో 85), ఇషాన్ కిషన్ (64 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 77)లతో పాటు కెప్టెన్ హార్దిక్ పాండ్యా (52 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 70 నాటౌట్), సంజూ శాంసన్ (41 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 51) అర్ధసెంచరీలతో మురిపించారు. దీంతో వెస్టిండీసతో మూడో వన్డేలో భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 351 పరుగుల భారీస్కోరు చేసింది. షెఫర్డ్‌కు 2 వికెట్లు దక్కాయి. ఇక, లారా స్టేడియంలో ఇదే తొలి పురుషుల వన్డే మ్యాచ్ కావడం విశేషం. ఈ మ్యాచ్‌కు కూడా రోహిత్, కోహ్లీ విశ్రాంతి తీసుకోవడంతో రుతురాజ్, ఉనాద్కట్ బరిలోకి దిగారు. కాగా, ఛేదనలో వెస్టిండీస్ కడపటి వార్తలందేసరికి 8 ఓవర్లలో 3 వికెట్లకు 25 పరుగులు చేసింది. ఈ మూడు వికెట్లు ముకేశ్‌కు దక్కాయి. అదిరే ఆరంభం: వరుసగా రెండో మ్యాచ్‌లోనూ టాస్ కోల్పోయిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. అయితే ఈసారి కూడా ఓపెనర్లు ఇషాన్, గిల్ నుంచి అద్భుత ఆరంభమే లభించగా.. చివర్లో హార్దిక్ సూపర్ ఫినిషింగ్‌కు భారత్ భారీ స్కోరందుకుంది. అలాగే నాలుగో నెంబర్‌లో వచ్చిన శాంసన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోవడంతో అతడున్నంత సేపు రన్‌రేట్ రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఆరంభం నుంచే ఓపెనర్లు బౌండరీల వేట మొదలెట్టారు. ఇషాన్‌కు రెండో ఓవర్‌లోనే లైఫ్ లభించింది. గిల్ నాలుగో ఓవర్‌లో రెండు ఫోర్లు బాదగా.. తర్వాతి ఓవర్‌లో ఇషాన్ మరో రెండు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అటు తొమ్మిదో ఓవర్‌లో వేగం పెంచుతూ గిల్ మూడు ఫోర్లతో 17 రన్స్ రాబట్టాడు. జోసెఫ్, షెఫర్డ్ ఓవర్లలో ఒక్కో సిక్సర్‌తో ఇషాన్ హ్యాట్రిక్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం గిల్ ఈ సిరీస్‌లో తొలి ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే 19వ ఓవర్‌లో 6,4తో దూకుడుగా కనిపించిన ఇషాన్ తర్వాతి ఓవర్‌లోనే కారియాకు చిక్కాడు. దీంతో తొలి వికెట్‌కు 143 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో దిగిన రుతురాజ్ (8) త్వరగానే వెనుదిరగ్గా.. శాంసన్ వచ్చీ రావడంతోనే రెండు సిక్సర్లతో బ్యాట్ ఝుళిపించాడు. ఎక్కువగా తనే స్ట్రయిక్ తీసుకుంటూ, 31వ ఓవర్‌లో 6,4తో ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ ఆ వెంటనే షెఫర్డ్ ఓవర్‌లో పెవిలియన్‌కు చేరడంతో మూడో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం విండీస్ స్పిన్నర్లు పట్టు బిగించడంతో మ్యాచ్‌లో వేగం తగ్గింది. దీనికి తోడు 37వ ఓవర్‌ను మెయిడెన్‌గా వేసిన స్పిన్నర్ మోటీ.. తర్వాతి ఓవర్‌లో కీలక గిల్ వికెట్‌ను తీశాడు. హార్దిక్ కాస్త నిదానంగానే ఆడగా, సూర్యకుమార్ (35) రాకతో డెత్ ఓవర్లలో భారత్ పుంజుకుంది. సూర్య 43వ ఓవర్‌లో 4,6.. 46వ ఓవర్‌లో మరో సిక్స్‌తో రెచ్చిపోయాడు. అతడి నిష్క్రమణ తర్వాత హార్దిక్ కూడా బ్యాట్‌కు పనిచెప్పాడు. దీంతో ఆఖరి ఓవర్‌లో 6,4,6తో 18 రన్స్ రావడంతో స్కోరు 350 దాటింది.

### స్కోరుబోర్డు

భారత్: ఇషాన్ (స్టంప్డ్) హోప్ (బి) కారియా 77, గిల్ (సి) కారియా (బి) మోటీ 85, రుతురాజ్ (సి) కింగ్ (బి) జోసెఫ్ 8, సంజూ శాంసన్ (సి) హెట్‌మయెర్ (బి) షెఫర్డ్ 51, హార్దిక్ (నాటౌట్) 70, సూర్యకుమార్ (సి) కారియా (బి) షెఫర్డ్ 35, జడేజా (నాటౌట్) 8, ఎక్స్‌ట్రాలు: 17బీ మొత్తం: 50 ఓవర్లలో 351/5బీ వికెట్ల పతనం: 1-143, 2-154, 3-223, 4-244, 5-309బీ బౌలింగ్: సీల్స్ 8-0-75-0, మేయర్స్ 4-0-25-0, జోసెఫ్ 10-0-77-1, మోటీ 10-1-38-1, షెఫర్డ్ 10-0-73-2, కారియా 8-0-58-1.







# మళ్లీ తెరపైకి ఖుషి కాంబినేషన్.. విజయ్ దళపతి 68

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ ప్రస్తుతం లియో సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. దళపతి 67గా వస్తున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ ప్రాజెక్ట్ సెట్స్ పై ఉండగానే మరోవైపు దళపతి 68 వార్త కూడా ఇప్పటికే తెరపైకి వచ్చింది. వెంకట్ ప్రభు డైరెక్షన్‌లో పాన్ ఇండియా కథాంశంతో దళపతి 68 ఉండబోతుంది. కాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి రెండు క్రేజీ వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ఈ మూవీలో సీనియర్ హీరోయిన్ జ్యోతిక ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించబోతుందట. వెంకట్ ప్రభు ఇటీవలే జ్యోతిక-సూర్య కపుల్‌ను సంప్రదించి.. ఇదే విషయమై చర్చించగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఇన్‌సైడ్ టాక్. 2000వ సంవత్సరంలో రొమాంటిక్ డ్రామాగా వచ్చిన ఖుషిలో నటించారు విజయ్-జ్యోతిక. మళ్లీ ఇన్నాళ్లకు ఈ ఇద్దరి కాంబినేషన్ దళపతి 68లో సందడి చేయబోతుండటం దాదాపు ఖాయమైనట్టేనని కోలీవుడ్ సర్కిల్ టాక్. ఖుషి చిత్రాన్ని డైరెక్ట్ చేసిన ఎస్‌జే సూర్య ఇందులో విలన్‌గా కనిపించబోతుండటం మరో ఇంట్రెస్టింగ్ విషయం. ఈ నేపథ్యంలో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పై ఖుషి క్రేజీ కాంబో ఎంటర్‌టైన్ మెంట్ ఎలా ఉండబోతున్నది ప్రస్తుతానికి ఆసక్తికరంగా మారింది. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నాడు. దళపతి 68కు సంబంధించిన పూర్తి వివరాలపై విజయ్ పుట్టినరోజైన జూన్ 22న క్లారిటీ రానుంది.







# ఎన్‌బీకే 108 చిత్రం బిజీలో బాలకృష్ణ

టాలీవుడ్ హీరో నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం ఎన్‌బీకే 108తో బిజీగా ఉన్నాడని తెలిసిందే. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. ఎన్‌బీకే 108 పవర్ ఫుల్ టైటిల్‌ను జూన్ 8న లాంఛ్ చేస్తున్నట్టు అనిల్ రావిపూడి టీం అప్‌డేట్ ఇచ్చేసింది. తాజాగా ఎన్‌బీకే 108 టీం అభిమానులకు మరో క్రేజీ న్యూస్ అందించింది. వర్కింగ్ టైటిల్‌కు తగ్గట్టుగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 108 హోర్డింగ్స్‌తో టైటిల్ లాంఛ్ చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. తాజా వార్తతో ఫుల్ ఖుషీ అవుతున్నారు అభిమానులు. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ చిత్రంలో పెళ్లి సందడి ఫేం శ్రీలీల కీలక పాత్రలో నటిస్తోంది. శ్రీలీల ఈ చిత్రంలో బాలయ్య స్నేహితుడు శరత్‌కుమార్ కూతురిగా కనిపించబోతుందట. ఇప్పటివరకు రాయలసీయ యాసలో అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించిన బాలయ్య.. తాజా ప్రాజెక్ట్‌లో తెలంగాణ యాసలో సరికొత్త వినోదాన్ని అందించబోతున్నాడని చెప్పాడు అనిల్ రావిపూడి. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. అఖండ, వీరసింహారెడ్డి చిత్రాలకు గూస్ బంప్స్ తెప్పించే బీజీఎం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించిన ఎస్ థమన్ మరోసారి సంగీతం అందించేందుకు రెడీ అవుతున్నాడు.




## 12నుంచి నెలరోజులపాటు సెట్లో మహేశ్‌బాబు

మహేష్ త్రివిక్రమ్ కాంబోలో తెరకెక్కుతున్న 'గుంటూరు కారం' సినిమా షూటింగ్ పరుగులు పెడుతుంది. అటు మహేష్ అభిమానులతో పాటు ప్రేక్షకులు సైతం ఈ సినిమా గురించి ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. అతడు, ఖలేజా వంటి కల్ట్ క్లాసిక్స్ తర్వాత వీళ్ల కాంబోలో తెరకెక్కుతున్న హాట్రిక్ సినిమా కావడంతో అందిరిలోనూ ఎక్కడలేని ఆసక్తి నెలకొంది. దానికి తోడు సూపర్ స్టార్ కృష్ణ బర్త్ డే సందర్భంగా రిలీజైన గ్లింప్స్ కు తిరుగులేని రెస్పాన్స్ వచ్చింది. వచ్చే ఏడాది సంక్రాంతిని టా÷-గ్గ్÷ట్ గా పెట్టుకుని చిత్రయూనిట్ శరవేగంగా షూటింగ్ జరుపుతున్నారు. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా షూటింగ్ కు సంబంధించి ఓ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతుంది. సినిమా కొత్త షెడ్యూల్ జూన్ 12 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తుంది. నెలరోజుల పాటు ఈ షెడ్యూల్ జరుగబోతుందట. అంతేకాకుండా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఈ సినిమా షూటింగ్ నిర్విరామంగా జరగనున్నట్లు సమాచారం. ఈ మేజర్ షెడ్యూల్లో మహేష్ బాబు, పూజా హెగ్డే, శ్రీలీలతో సహా ప్రధాన తారాగణంపై సీన్స్ చిత్రీకరించనున్నారట. యాక్షన్ ఫ్యామిలీ ఎంట్టంల్గ÷నర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.చినబాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. మ్యూజిక్ సెన్సేషన్ థమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. ఇందులో మహేష్ స్టైలిష్ లుక్,



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in